సోమవారం 06-5-2024

# ముందడుగు దినపత్రిక

సంపుటి: 1, సంచిక: 326, పేజీలు: 4 | ₹6

EPAPER.MUNDADUGU.COM

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD



మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయొచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp: 9491114616

email: mundadugu111@gmail.com


# పాఠశాలలో నేను బెత్తం దెబ్బలు తిన్నాను

- ఆ రోజును ఎప్పటికీ మరచిపోలేను
- సుప్రీంకోర్టు సీజే డీవై చంద్రచూడ్ వ్యాఖ్యలు



**ముందడుగు జాతీయంప**

తాను కూడా చిన్నప్పుడు పాఠశాలలో బెత్తం దెబ్బలు తిన్నానని భారత ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ అన్నారు. ఈ విషయాన్ని స్వయంగా ఆయనే వెల్లడించారు. ఆ రోజును ఎప్పటికీ మరచిపోలేనని తెలిపారు. 'జువైనల్ జస్టిస్' (బాలల నేర న్యాయవ్యవస్థ) అంశంపై నేపాల్‌లో జరుగుతున్న సదస్సుకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తన బాల్యాన్ని గుర్తు చేసుకున్నారు. పిల్లలతో ఉపాధ్యాయుల ప్రవర్తనా విధానం వారి మనసుపై లోతైన ప్రభావం చూపుతుందని.. అది వారికి జీవితాంతం గుర్తుండిపోతుందని జస్టిస్ డీవై చంద్రచూడ్ పేర్కొన్నారు. ''నేను 5వ తరగతి చదువుతున్న రోజుల్లో జరిగిన సంఘటనను ఎప్పటికీ మర్చిపోలేను. ఆ సమయంలో క్రాఫ్ట్ నేర్చుకుంటున్నా. అసైన్‌మెంట్ కోసం అవసరమైన సరైన సైజు గల సూదులను తీసుకురాలేదు. ఈ విషయం తెలుసుకుని మా టీచర్ నాపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బెత్తంతో నా చేతిపై బలంగా కొట్టారు. చేతిపై కొట్టకుండా మరెక్కడైనా కొట్టమని ఎంతో వేడుకున్నా. దెబ్బలకు నా కుడి చేయి కందిపోయింది. అవమానంతో 10 రోజుల వరకు చేతిని ఎవరికీ చూపించుకోలేదు'' అని పంచుకున్నారు.



సిగ్నల్ ఇవ్వక నిద్రపోయిన

## స్టేషన్ మాస్టర్


వివరాలు 3లో




## హామీల బాండ్ పేపర్ విడుదల చేసిన జెడీ


వివరాలు 4లో


# అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తాత్కాలికమే

- ఎప్పుడు ఎన్నికలు వచ్చినా మనదే ప్రభుత్వం
- వీణవంకలో ఎన్నికల ప్రచారంలో కేసీఆర్

ముందడుగు కరీంనగర్:

అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తాత్కాలికమే. రాజకీయాల్లో ఉన్నవారికి గెలుపోట:ములు సహజం. గెలిస్తేనే లెక్క అనుకోవద్దు. గెలిచినా, ఓడినా ప్రజల కోసం పనిచేస్తూనే ఉండాలని తెలంగాణలో ఎప్పుడు అసెంబ్లీ ఎన్నికలు వచ్చినా భారాస ప్రభుత్వమే వస్తుందని ఆ పార్టీ అధినేత కేసీఆర్ అన్నారు. కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కు మద్దతుగా వీణవంకలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో కేసీఆర్ ప్రసంగించారు.

జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణకు పేరు వచ్చే విధంగా కష్టపడ్డాను. రాష్ట్రానికి పరిశ్రమలు తెచ్చేందుకు ఎంతో కృషి చేశాం. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత హైదరాబాద్ నుంచి అనేక పరిశ్రమలు వెళ్లిపోవాలని యోచిస్తున్నాయి. రాష్ట్రంలో రూ.



వెయ్యి కోట్లు పెట్టుబడి పెట్టే కంపెనీ ఒకటి తమిళనాడుకు వెళ్లి పోయింది. అల్యూమినియం, ప్లాస్టిక్ తయారీ పరిశ్రమలకు విద్యుత్ కోతలు విధిస్తున్నారు. దీంతో ఆ కంపెనీలు తెలంగాణ నుంచి వెళ్లిపోవాలనుకుంటున్నాయని మీడియాలో వార్తలు చూస్తుంటే బాధేస్తోంది. నాలుగైదు నెలల్లోనే ఇలా చేశారని దుఃఖం కలుగుతోంది. తెలంగాణ ఉద్యమం అయి పోలేదు.. ఇంకా ఉంది. తెలంగాణ పునర్నిర్మాణ ప్రక్రియ ముందుకు సాగాల్సిన అవసరముంది.

మంచు కొండల్లో గర్భిణీ ప్రాణం కాపాడిన

# భారత సైన్యం



**ముందడుగు జాతీయం:**

విషమ పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతోన్న ఓ గర్భిణిని విపత్కర వాతావరణ పరిస్థితుల నడుమ సురక్షిత ప్రదేశానికి తరలించి సకాలంలో చికిత్స అందేలా చూసి, ఆమె ప్రాణాలను


మిగతా 2లో




## ప్రతిరోజూ ఒక లవంగం తింటే చాలు


వివరాలు 4లో


## ఏఎస్ఐని ట్రాక్టర్‌తో తొక్కించి చంపిన ఇసుక మాఫియా


వివరాలు 2లో

ముందడుగు
సోమవారం, 06-5-2024, హైదరాబాద్

## ఏఎస్ఐని ట్రాక్టర్‌తో తొక్కించి
# చంపిన ఇసుక మాఫియా

**ఇసుక అక్రమ తరలింపును అడ్డుకునేందుకే దారుణం**

**ముందడుగు మధ్యప్రదేశ్:**





ఇసుక మాఫియా అరాచకాలకు మరో ఏఎస్ఐ బలైపోయాడు. తాజాగా మధ్యప్రదేశ్ షాదోల్ జిల్లాలో ఇసుక మాఫియా ఆగడాలకు మరో పోలీస్ అధికారి బలయ్యారు. ఇసుక అక్రమ తరలింపును అడ్డుకునేందుకు వెళ్లిన ఏఎస్ఐ మహేంద్ర బాగ్రీని ట్రాక్టర్‌తో తొక్కించి చంపేశారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వివరాల్లోకి వెళ్తే ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారం అందడంతో షాదోల్ జిల్లా కేంద్రానికి చెందిన ఏఎస్ఐ మహేంద్ర బాగ్రీ.. ప్రసాద్ కనోజీ, సంజయ్ దూబే అనే ఇద్దరు కానిస్టేబుళ్లతో కలిసి ఘటనా ప్రాంతానికి వెళ్లారు. ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌కు వారు అడ్డం తిరడంతో డ్రైవర్ ట్రాక్టర్‌ను ఆపకుండా తొక్కించాడు. దాంతో ఏఎస్ఐ మహేంద్ర బాగ్రీ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఇద్దరు కానిస్టేబుళ్లు తృటిలో తప్పించుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ట్రాక్టర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఇంటరాగేషన్‌లో ఇసుక అక్రమ తరలింపులో ట్రాక్టర్ ఓనర్, ట్రాక్టర్ ఓనర్ కుమారుడికి పాత్ర ఉన్నట్లు తేలింది. దాంతో ట్రాక్టర్ ఓనర్ కుమారుడిని కూడా అదుపులోకి తీసుకున్నారు. పరారీలో ఉన్న ట్రాక్టర్ ఓనర్ కోసం గాలిస్తున్నారు.

## మంచు కొండల్లో గర్భిణీ ప్రాణం కాపాడిన
# భారత సైన్యం

**ముందడుగు జాతీయం:**

భారత సైన్యం నిలబెట్టింది. అధికారుల వివరాల ప్రకారం.. జమ్మూకశ్మీర్‌లోని కుప్వాడా జిల్లాలో నియంత్రణ రేఖ వెంబడి మారుమూల పల్లెకు చెందిన ఓ గర్భిణి ఆరోగ్యం విషమించింది. స్థానికంగా వైద్య నిపుణులు అందుబాటులో లేని దుస్థితి నెలకొంది. రోడ్డు మార్గంలో వేరేచోటికి తరలించాలన్నా.. స్థానికంగా భారీగా మంచు కురవడంతో రహదారులన్నీ మూసుకుపోయాయి. ఈ విషయం తెలుసుకున్న గుగల్ధార్ బెటాలియన్ వెంటనే రంగంలోకి దిగింది. జుమాగుండ్‌లోని ఆర్మీ యూనిట్ నర్సింగ్ అసిస్టెంట్, పీకే గలిలోని బెటాలియన్ వైద్యాధికారి తొలుత ఆమెకు ప్రథమ చికిత్స అందించారు. అనంతరం స్ట్రెచర్‌పైకి చేర్చి.. గ్రామస్థుల సాయంతో కాలినడకన ఇతర ప్రాంతానికి సురక్షితంగా తరలించారు. ప్రజల నమ్మకాన్ని సైన్యం మరోసారి నిలబెట్టుకుందని అధికారులు తెలిపారు.

## మత్తు పదార్థాలు ఇచ్చి
# అత్యాచారం చేశారు


**ఆస్ట్రేలియాలో మహిళా మంత్రి వెల్లడి**

**ముందడుగు జాతీయం:**



ఆస్ట్రేలియాలో ఓ మహిళా ఎంపీకి తన సొంత నియోజకవర్గంలోనే దారుణ సంఘటన ఎదురైంది. రాత్రి వేళ బయటకు వెళ్లిన ఆమెకు కొందరు దుండగులు మత్తుమందు ఇవ్వడమే కాకుండా లైంగిక వేధింపులకు పాఅల్పడ్డారు. ఈ ఘటనను ఆమె స్వయంగా సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. ఆ రోజు ఏం జరిగిందో వివరించారు.

క్వీన్స్ లాండ్ ఎంపీ బ్రిటనీ లాగా (37).. ఆరోగ్య శాఖ సహాయ మంత్రిగా ఉన్నారు. ఇటీవల ఒక రోజు సాయంత్రం వేళ ఆమె బయటకు వెళ్లారు. ''ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు మత్తు పదార్థాలు ఇచ్చి నాపై అత్యాచార యత్నానికి పాల్పడ్డారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశా. అనంతరం వైద్యులు నాకు పరీక్షలు నిర్వహించారు. శరీరంలో మత్తు పదార్థాలు ఉన్నట్లు ధ్రువీకరించారు. కానీ.. వాటిని నేను తీసుకోలేదు'' అని వెల్లడించారు. ఈ ఘటన ఏప్రిల్ 28న చోటు చేసుకున్నట్లు వివరించారు.



# 12 మంది ఎమ్మెల్యేలు ఎంపీలుగా పోటీ

- వీరు గెలిస్తే మళ్లీ ఎమ్మెల్యే ఎన్నికలు
- పంజాబ్‌లో రసవత్తరంగా రాజకీయం

**ముందడుగు పంజాబ్ :**

పంజాబ్ రాష్ట్రంలో పన్నెండు మంది ఎమ్మెల్యేలు లోక్‌సభ ఎన్నికల బరిలోకి ఉన్నారు. వీరు విజయం సాధిస్తే.. ఆయా అసెంబ్లీ స్థానాల్లో ఆరు నెలల్లో ఉప ఎన్నికలు వస్తాయి. రాష్ట్రంలో ఇంతమంది ఎమ్మెల్యేలు లోక్‌సభకు పోటీచేస్తుండటం గతంలో ఎన్నడూ చూడలేదని విశ్లేషకులు అంటున్నారు. పంజాబ్‌లో 13 లోక్‌సభ నియోజకవర్గాలు ఉన్నాయి. ఇందులో 9 నియోజకవర్గాల్లో మొత్తం 12 మంది ఎమ్మెల్యేలు పోటీ పడుతున్నారు. వీరిలో ఐదుగురు మంత్రులు ఉండటం గమనార్హం. ఆరు లోక్‌సభ స్థానాల్లో ఒక్కో ఎమ్మెల్యే తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటుండగా.. మరో మూడు స్థానాల్లో ఇద్దరేసి ఎమ్మెల్యేలు పోటీలో ఉన్నారు. పోటీపడుతున్న ఎమ్మెల్యేల్లో అధికార ఆమ్‌ఆద్మీ పార్టీకి చెందినవారే తొమ్మిది మంది ఉన్నారు. మిగతా ముగ్గురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్నారు.

## అబ్బాయిలతో ఫోన్ మాట్లాడొద్దని
# హెచ్చరించిన అన్న

**అన్న నిద్రపోతున్న సమయంలో నరికిచంపిన చెల్లె**



**ముందడుగు ఛత్తీస్‌గఢ్:**

అబ్బాయిలతో ఫోన్ ఎందుకు మాట్లాడుతున్నావని మందలించినందుకు ఓ 14 ఏండ్ల బాలిక తన అన్నని నరికి చంపింది. ఛత్తీస్‌గఢ్‌లోని ఖైరాగఢ్ చుయిఖదాన్ గండై జిల్లాలో జరిగిన దారుణం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

గ్రామానికి చెందిన 14 ఏండ్ల బాలిక తరచూ ఫోన్‌లో అబ్బాయిలతో మాట్లాడుతున్నది. గమనించిన ఆమె అన్న (18).. ఇకపై ఫోన్‌లో అబ్బాయిలతో మాట్లాడొద్దని ఈ నెల 3న హెచ్చరించాడు. మొబైల్ వాడటానికి వీల్లేదని చెప్పాడు. దీంతో అన్నపై కోపంతో రగిలిపోయిన ఆమె.. అతడు నిద్రపోతున్న సమయంలో గొడ్డలి తీసుకుని మెడపై నరికింది. తీవ్రంగా గాయపడటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. రక్తపు మరకలు కావడంతో స్నానం చేసిన ఆమె.. ఆ దుస్తులను దాచి పెట్టింది. అనంతరం తన అన్నని ఎవరో హత్యచేశారని ఇరుగుపొరుగువారికి చెప్పింది. దీంతో స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పరిసరాలను పరిశీలించారు. బాలికను తమదైన శైలిలో ప్రశ్నించడంతో నేరాన్ని ఒప్పుకున్నది. అన్నని తానే చంపానని, ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేరని వెల్లడించింది. ఫోన్‌లో మాట్లాడినందుకు తనను దూషించడాని.. అందుకే చంపేశానని తెలిపింది.

## రానున్న ఐదురోజులు వానలు

**వాతావరణశాఖ**

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

రాగల ఐదురోజుల్లో తెలంగాణలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాపాతం నమోదయ్యే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. మరో వైపు పలు జిల్లాల్లో వడగాలులు కొనసాగే అవకాశాలున్నాయని పేర్కొంది. దాంతో ఆయా జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది

ముందడుగు
సోమవారం, 06-5-2024, హైదరాబాద్

# బాలికపై అత్యాచారానికి పాల్పడ్డ ఇద్దరు వ్యక్తులు

## ఆ ఇద్దరిని కొట్టి చంపిన గ్రామస్థులు

**ముందడుగు మేఘాలయ:**



ఒక ఇంట్లో ఒంటరిగా ఉన్న 17 ఏళ్ల బాలికపై ఇద్దరు వ్యక్తులు కత్తితో దాడి చేశారు. ఆమెను బెదిరించి లైంగిక దాడికి ప్రయత్నించారు. బాలిక కేకలు వేయగా స్థానికులు అక్కడకు చేరుకున్నారు. బాలికపై అత్యాచారానికి ప్రయత్నించిన ఇద్దరు వ్యక్తులను పట్టుకుని సమీపంలోని కమ్యూనిటీ హాల్ వద్దకు తీసుకెళ్లారు. అక్కడ సుమారు 1500 మంది గుమిగూడారు. వారంతా కలిసి ఆ ఇద్దరు వ్యక్తులను కట్టేసి దారుణంగా కొట్టారు. మేఘాలయలోని ఈస్టర్న్ వెస్ట్ ఖాసీ హిల్స్ జిల్లా నోంగ్తిలీవ్ గ్రామంలో ఈ సంఘటన జరిగింది. మరోవైపు ఈ విషయం తెలిసిన పోలీసులు అక్కడకు చేరుకున్నారు. జనం చెర నుంచి ఆ ఇద్దరు వ్యక్తులను రక్షించేందుకు ప్రయత్నించారు. అయితే వారిని అక్కడి నుంచి తీసుకెళ్లేందుకు పోలీసులను జనం అనుమతించలేదు. ఇంతలో ఒక గుంపు ఆ ఇద్దరు వ్యక్తులను మరోసారి చావకొట్టారు. చివరకు అచేతనంగా పడి ఉన్న వారిద్దరిని పోలీసులు ఆసుపత్రికి తరలించారు. అయితే వారు అప్పటికే మరణించినట్లు డాక్టర్లు తెలిపారు. మృతులు ఇద్దరూ ఆ గ్రామంలో కార్మికులుగా పని చేస్తున్నారని పోలీసులు తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### సిక్కుల పవిత్ర గ్రంథం పేజీలను చించిన యువకుడు

# ఆగ్రహించిన సిక్కులు యువకుడిని కొట్టి చంపారు

**ముందడుగు పంజాబ్:**





గురుద్వారాలో ఒక యువకుడు సిక్కుల పవిత్ర గ్రంథం గురు గ్రంథ్ సాహిబ్‌లోని కొన్ని పేజీలను చించాడు. ఆగ్రహించిన సిక్కులు అతడిని కొట్టి చంపారు. పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. శనివారం బండాలా గ్రామంలోని గురుద్వారా బాబా బీర్ సింగ్ వద్ద 19 ఏళ్ల బక్షీష్ సింగ్ అనుచితంగా ప్రవర్తించాడు. సిక్కుల పవిత్ర గ్రంథం గురు గ్రంథ్ సాహిబ్‌లోని కొన్ని పేజీలను చించివేశాడని స్థానికులు ఆరోపించారు. పారిపోతున్న అతడ్ని పట్టుకుని చేతులు కట్టేసి దారుణంగా కొట్టారు.

ఈ విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకున్నారు. రక్తం కారుతున్న బక్షీష్ సింగ్‌ను ఆసుపత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ అతడు మరణించాడు. మరోవైపు తన కుమారుడు మానసిక వికలాంగుడని, రెండేళ్లుగా మందులు వాడుతున్నాడని బక్షీష్ సింగ్ తండ్రి లఖ్వీందర్ సింగ్ పోలీసులకు చెప్పాడు. తన కుమారుడ్ని చంపిన వారిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశాడు.

# సిగ్నల్ ఇవ్వక నిద్రపోయిన స్టేషన్ మాస్టర్

**పట్టాలపై అరగంట పాటు నిలిచిపోయిన రైలు**



**ముందడుగు ఉత్తరప్రదేశ్:**

విధుల్లో ఉన్న ఓ స్టేషన్ మాస్టర్‌కి నిద్ర ముంచుకురావడంతో రైలు వచ్చిన సంగతి మరిచిపోయాడు. సిగ్నల్ రాకపోవడంతో అరగంటపాటు పట్టాలపై ట్రైన్ నిలిచిపోయింది. ఆ తర్వాత అధికారులు ప్రయాణీకులకు క్షమాపణలు చెప్పాల్సి వచ్చింది. ఈ ఘటన ఉత్తరప్రదేశ్‌లో చోటుచేసుకుంది.

అధికారులు వెల్లడించిన ప్రకారం.. పట్నా కోటా మధ్య రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్ ట్రైన్ మే 3న ఉడిమోర్ జంక్షన్‌కు వద్దకు వచ్చింది. అక్కడున్న స్టేషన్ మాస్టర్ నిద్రలోకి జారుకున్నాడు. మరోవైపు గ్రీన్ సిగ్నల్ లేకపోవడంతో రైలును లోకోపైలట్ అక్కడే నిలిపేశాడు. స్టేషన్ మాస్టర్‌ను మేల్కొలిపేందుకు లోకోపైలట్ అనేక సార్లు హారన్ కొట్టినా ఫలితం లేదు. దాంతో రైలు పట్టాలపై అరగంటపాటు నిలిచిపోయింది. దీంతో ఆ రైలులోని ప్రయాణికులు అసహనానికి గురైయ్యారు. డ్యూటీలో అలసత్వాన్ని తీవ్రంగా పరిగణించిన ఆగ్రా డివిజన్ రైల్వే ఉన్నతాధికారులు.. స్టేషన్ మాస్టర్‌నుంచి వివరణ కోరారు. అనంతరం తగు క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని ఆగ్రా రైల్వే డివిజన్ పీఆర్‌వో ప్రశస్తి శ్రీవాస్తవ వెల్లడించారు. స్టేషన్ మాస్టర్ తన తప్పును అంగీకరించాడని, తప్పిదానికి క్షమాపణ చెప్పినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. తనతోపాటు విధుల్లో ఉన్న పాయింట్‌మెన్ ట్రాక్ చెకింగ్‌కు వెళ్లడంతో.. తాను స్టేషన్‌లో ఒంటరిగా ఉన్నట్లు తెలిపాడని వెల్లడించాయి.



# ఓటు వెయ్యాలంటే రోడ్లు వెయ్యాలని డిమాండ్

- **గుర్రాలపై ప్రయాణిస్తూ గిరిజనుల నిరసన**
- **రోడ్డు సౌకర్యం లేక అవస్థలు పడుతున్నామని ఆవేదన**

**ముందడుగు అల్లూరి:**

ఆంధ్రప్రదేశ్‌లో సార్వత్రిక ఎన్నికలు దగ్గరపడుతున్న తరుణంలో అల్లూరి జిల్లాలోని గిరిజనులు వినూత్న నిరసనకు దిగారు. అనంతగిరి మండలం మద్రేబు గ్రామం గిరిజనులు అడవుల గుండా గుర్రాలపై ప్రయాణిస్తూ తమ నిరసనను తెలిపారు. ఆదివాసీల కోసం కోట్ల నిధులు ఖర్చు చేసామని లెక్కలు చూపిస్తున్నారు కానీ, అభివృద్ధి పనులు మాత్రం వాస్తవంలో కనిపించడంలేదని ఆరోపించారు. రోడ్డు సౌకర్యం లేక తాము ఎన్నో అవస్థలు పడుతున్నామని, ఎన్ని ప్రభుత్వాలు మారినా తమ రాతలు మారడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతంలో ఏపీలో సార్వత్రిక ఎన్నికలకు ఆయా పార్టీలు, నేతలు సన్నద్ధమవుతున్నారు. మారుమూల గ్రామాలకు సైతం వెళ్లి ప్రచారం హోరెత్తిస్తున్నారు. ఈ క్రమంలో అల్లూరి జిల్లా గిరిజనులు నిరసనకు దిగారు. తాము ఓటు వెయ్యాలంటే రోడ్లు వెయ్యాలని డిమాండ్ చేశారు. ఓటు వేసేందుకు వెళ్లాలంటే 30 కిలోమీటర్లు గుర్రాలపై వెళ్లాల్సి వస్తోందని ఒక్కొక్కరికి రూ.500లు ఖర్చవుతోందని, ఏ ప్రభుత్వాలూ తమను పట్టించుకోవడంలేదని నిరసనకు దిగారు. నెత్తిమీద అడ్డాకులు పెట్టుకుని గుర్రాలపై ప్రయాణిస్తూ నిరసన తెలిపారు. రోడ్లు వేస్తేనే ఓటు వేస్తామని డిమాండ్ చేశారు.

# రేవంత్ ఆరు గ్యారెంటీలు ఎక్కడ?

- **బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు**

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**



రేవంత్ రెడ్డి అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్ అయితే.. అబద్ధాలు చెప్పి రాహుల్ గాంధీ రాంగ్ గాంధీ అయ్యాడని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. నిర్మల్ సభలో రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను హరీశ్‌రావు ఖండించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. హామీల అమలులో కాంగ్రెస్ రాహుల్ గాంధీతో సైతం అబద్ధాలు ఆడిస్తుందన్నారు. రాహుల్ గాంధీ నిర్మల్ సభలో మహిళలకు నెలకు రూ.2500 వేస్తున్నామని చెప్పి అబద్ధమాడారని విమర్శించారు.

### రాహుల్, రేవంత్ కలిసి మోసం..

రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. రాహుల్, రేవంత్ రెడ్డి ఇద్దరు కలిసి రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఇయ్యని హామీలు ఇస్తున్నామని రాష్ట్ర ప్రజలను బురిడీ కొట్టిస్తున్నారన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు వంద రోజుల్లో అమలు చేయనందుకు రాహుల్ భేషరతుగా క్షమాపణ చెప్పాలని.. ఆ తర్వాతే ఓట్లు అడగాలన్నారు. కాంగ్రెస్ బాండ్ పేపర్ బౌన్స్ అయ్యిందని.. ఈ విషయంలో ప్రతిరోజూ బీఆర్ఎస్ నిలదీస్తుందని స్పష్టం చేశారు. కేంద్రంలో అధికారంలోకి వస్తామని రాహుల్ చెబుతున్నాడని.. 'కూట్లె రాయి తియనోడు ఎట్లె రాయి తిస్తాడట' అన్నట్లుగా ఉందని విమర్శించారు. రాహుల్ గాంధీ హామీలు అమలు నాది బాధ్యత అని కర్ణాటక లో మోసం చేసి నేడు ఆరు గ్యారంటీలు తెలంగాణలో అమలు అవుతున్నాయని చెప్పి మోసం చేస్తున్నాడని విమర్శించారు. మోదీ నల్లధనం తెస్తామని అబద్ధాలాడారని.. రాష్ట్రంలోని మహిళలు ఓట్ల కోసం వస్తున్న కాంగ్రెస్ నేతలను రూ.2500పై నిలదీయాలన్నారు.

ముందడుగు
సోమవారం,
06-5-2024,
హైదరాబాద్

# క్రెటా అడిగితే వ్యాగన్ఆర్ కారును ఇచ్చాడని పెళ్లి రద్దు

**పెళ్లి కుమారుడిపై కేసు నమోదు చేసిన పోలీసులు**





**ముందడుగు ఉత్తరప్రదేశ్:**
పెళ్లికి కట్నం కింద తాను కోరిన కారు కట్నంగా ఇవ్వలేదని వరుడు పెళ్లిని ఆపేశాడు. ఈ ఘటన ఉత్తర్ ప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్‌లోని రసూల్‌పూర్‌లో జరిగింది. తన కట్నం డిమాండ్‌ని నెరవేర్చకపోవడంతో చివరి నిమిషంలో పెళ్లి ఆగిపోయింది. పెళ్లి కొడుకు హ్యుందాయ్ క్రెటా కారును కట్నంగా అడిగితే, పెళ్లి కూతురు తల్లిదండ్రులు వ్యాగన్‌ఆర్ కారును ఇస్తున్నారని తెలుసుకున్న వరుడు చివరి నిమిషంలో వివాహాన్ని రద్దు చేసుకున్నాడు. పెళ్లికూతురు ఇంటికి వెళ్లకుండా బారాత్‌ని నిలిపివేశాడు. పెళ్లికొడుకును అమీర్ ఆలమ్‌గా గుర్తించారు.

నచ్చిన కారు ఇవ్వకపోవడంతో చివరి క్షణంలో తనను వివాహం చేసుకోవడానికి నిరాకరించాడని ఆమె విలపిస్తూ ఆరోపించింది. రూ.25 లక్షల కారు అడిగితే, తాము రూ.7 లక్షల కారు ఇచ్చినందుకు పెళ్లి రద్దు చేసుకున్నాడని, తమకు మోడీ ప్రభుత్వం న్యాయం చేయాలని ఆమె కోరారు. పెళ్లికూతురు తండ్రి యాకుబ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. అమీర్ ఆలం ప్రభుత్వ ఉద్యోగి అని, ఫిర్యాదు మేరకు చర్యలు తీసుకుంటున్నామని పోలీసులు వెల్లడించారు.





# హామీల బాండ్ పేపర్ విడుదల చేసిన జెడీ

- గంజాయి నిర్మూలన, నిరుద్యోగ సమస్య నివారణ
- ఇతర అంశాలతో 100 రూపాయలు బాండ్ పేపర్
- ఆలోచించి ఓటు వెయ్యాలన్న జెడీ లక్ష్మినారాయణ

**ముందడుగు విశాఖపట్నం:**
తాము బాధ్యత కూడిన రాజకీయాలు చేయడానికి వచ్చాము కానీ ఏదో మాయమాటలు అబద్ధాలు చెప్పి ప్రజలను ఏ మార్చడానికి రాలేదని అందుకే మేము ఇచ్చే వాగ్దానాలకు చట్టబద్ధత కల్పించేందుకు 100 రూపాయలు బాండ్ పేపర్ పై రాసి ఇస్తున్నామని జై భారత్ పార్టీ అధ్యక్షులు విశాఖ ఉత్తరం నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి వివి లక్ష్మీనారాయణ అన్నారు. అదివారం సీతమ్మధార పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖ ఉత్తర నియోజకవర్గం ప్రజలు తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గ సమస్యలన్నీ పరిష్కరించి ఉత్తమ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని ఆయన హామీ ఇచ్చారు. తన హామీలకు చట్టబద్ధత కలిపించేలా 34 అంశాలతో కూడిన బాండ్ పేపర్ ఆయన విడుదల చేశారు. తమ పార్టీలోని పోటీ చేస్తున్న మిగతా అభ్యర్థులందరూ ఇలాగే తమ తమ నియోజకవర్గం సమస్యలపై బాండ్ పేపర్ పై రాసి హామీ ఇస్తున్నారని ఆయన తెలిపారు. విభజన హామీలు అమలు చేయని రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వని బిజెపికి ఏ విధంగా టిడిపి జనసేన మద్దతు పలుకుతున్నాయని ఆయన ప్రశ్నించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గత ఐదు సంవత్సరాలలో చేసిన అప్పులపై శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

తన నియోజక వర్గానికి సంబంధించిన సమస్యలపై ప్రస్తావించిన 34 అంశాల్లో ప్రధానంగా గంజాయి బారినుండి యువతను రక్షించడం, నియోజకవర్గంలో అర్హులైన పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, ధోబిఘాట్ లలో ఆధునీకరణ, కొండవాలు ప్రాంతాలు ప్రజలకు మౌలిక వసతులు కల్పించడం, నియోజకవర్గంలో నిరుద్యోగ సమస్య లేకుండా చేయడం మొదలైన అంశాలు ఉన్నాయి. ప్రజలందరూ మోసపూరిత వాగ్దానాలను నమ్మకుండా డబ్బుకు లొంగకుండా విజ్ఞతతో ఆలోచించి ఓటు వేయాలని ఎవరైతే తమ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయగలరని నమ్మకం కలిగించగలరో వారికే ఓటు వేయాలని ఉత్తుత్తి వాగ్దానాలను నమ్మవద్దని ఆయన ప్రజలను కోరారు.

# ప్రతిరోజూ ఒక లవంగం తింటే చాలు

**ముందడుగు ప్రత్యేకం:**
ప్రతిరోజు ఒక లవంగం తింటే ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. మన దేశంలో అనేక రకాల సుగంధ ద్రవ్యాలు లభిస్తాయి. వీటిని వంటల్లో, అలాగే ఆయుర్వేద వైద్యంలో కూడా వాడతారు. వివిధ రకాల దినుసులు వంటలకు ప్రత్యేక రుచిని తీసుకొస్తాయి. అయితే వీటిలోని మెడికల్ ప్రాపర్టీస్ కారణంగా అనారోగ్యాలు సైతం రావని తెలుస్తుంది. ముఖ్యంగా లవంగాలతో మంచి హెల్త్ బెనిఫిట్స్ ఉంటాయి. వీటిలోని సమ్మేళనాలు సమ్మర్ సీజన్‌లో వచ్చే ఆరోగ్య సమస్యలకు చెక్ పెడతాయి. ప్రతిరోజూ ఒక లవంగం పలుకు తింటే ఆరోగ్యానికి చాలా మంచిది. దీనితో ఎలాంటి హెల్త్ బెనిఫిట్స్ ఉంటాయో ఒకసారి తెలుసుకోండి.

### చర్మ ఆరోగ్యం

వేసవి కాలంలో అధిక వేడి, చెమట కారణంగా వివిధ రకాల చర్మ సమస్యలు రావచ్చు. ఆహారంలో వీటిని చేర్చుకుంటే ఈ సీజన్‌లో ఎదురయ్యే స్కిన్ ప్రాబ్లమ్స్ రిస్క్ తగ్గుతుంది. లవంగాల్లో యాంటీ ఏజింగ్ లక్షణాలు ఉంటాయి. ఇవి సమ్మర్‌లో అధిక వేడి వాతావరణం కారణంగా వచ్చే వృద్ధాప్యాన్ని తగ్గిస్తూ, చర్మ ఆరోగ్యాన్ని ప్రోత్సహిస్తాయి.

### మంచి పోషకాలకు నిలయం

లవంగాల్లో విటమిన్లు, ఖనిజాలు, అనేక ముఖ్యమైన పోషకాలు ఉంటాయి. వీటిలో విటమిన్లు E, C, A, D, రైబోఫ్లావిన్, థయామిన్ వంటి Bకాంప్లెక్స్ విటమిన్లు, ఆరోగ్యానికి మేలు చేసే యాంటీఆక్సిడెంట్లు సైతం ఉంటాయి. ఇవి శరీరాన్ని ఆక్సీకరణ ఒత్తిడి నుండి రక్షిస్తాయి. లవంగాలు



యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీమైక్రోబయల్ లక్షణాలతో వివిధ వ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తాయి.

### జీర్ణ ఆరోగ్యం

లవంగాల్లోని సమ్మేళనాలు జీర్ణక్రియను ప్రోత్సహిస్తాయి. ఇవి జీర్ణ ఎంజైమ్స్ ఉత్పత్తిని ప్రేరేపించడంతో పాటు పేగు లోపలి కదలికలను మెరుగుపరుస్తాయి. లవంగాలు కార్మినేటివ్ ప్రభావంతో గ్యాస్, ఉబ్బరం నుంచి ఉపశమనం కల్పిస్తాయి.

### యాంటీఆక్సిడెంట్లు

లవంగాల్లో ఎన్నో రకాల యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించడంతో పాటు ఫ్రీ రాడికల్స్‌తో పోరాడతాయి. నొప్పి నుంచి ఉపశమనం కల్పించే లక్షణాలు వీటి సొంతం.

### బ్లడ్ షుగర్ కంట్రోల్

రక్తంలో చక్కెరను నియంత్రించే సామర్థ్యం లవంగాలకు ఉంటుంది. ఇవి రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను రెగ్యులేట్ చేయడంతో పాటు ఇన్సులిన్ సెన్సిటివిటీని మెరుగుపర్చగలవని కొన్ని అధ్యయనాల్లో తేలింది. అయితే ఇవి మధుమేహానికి చికిత్స చేసే మెడిసిన్ మాత్రం కావు.

### నోటిని శుభ్రం చేస్తాయి

లవంగాలు నమలడం వల్ల నోటి ఆరోగ్యం మెరుగుపడుతుంది. వీటిలోని యాంటీమైక్రోబయల్ లక్షణాలు సూక్ష్మజీవులను నిర్మూలించి, నోటిని శుభ్రం చేస్తాయి. తద్వారా కావిటీస్, గమ్ డిసీజ్ వంటి దంత సమస్యల రిస్క్ తగ్గుతుంది. లవంగం నూనెను డెంటల్ ప్రాబ్లమ్స్‌కు చికిత్సగా, ఓరల్ కేర్ ప్రొడక్ట్స్ తయారీలో కూడా ఉపయోగిస్తారు.

### తెలుసుకోవాల్సిన విషయాలు

లవంగాలను మితంగా తింటే ఎలాంటి సమస్యలు ఉండవు. అయితే ఇవి అందరికీ పడకపోవచ్చు. ఎక్కువ మొత్తంలో లవంగాలు తింటే ఎసిడిటీ, యాసిడ్ రిఫ్లక్స్ వంటి ప్రాబ్లమ్స్, ఇతర సైడ్ ఎఫెక్ట్స్ రావచ్చు. లవంగం నూనె వినియోగం పెరిగితే వికారం, వాంతులు, విరేచనాలు, ఇతర జీర్ణ సమస్యలు ఎదురవుతాయి. ఇది కొన్నిసార్లు విషపూరితం కూడా కావచ్చు.